ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

గణపవరం : మండల కేంద్రమైన గణపవరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని ఏలూరు రేంజి డిఐజి జివిజి.అశోక్‌కుమార్, ఏలూరు జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి అన్నారు. గణపవరం పోలీస్‌స్టేషన్‌ను వారు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణపవరం వ్యాపార కేంద్రంగా ఉండడం వల్ల ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని చెప్పారు. ఈ సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు చేపడతామని చెప్పారు. గణపవరం స్టేషన్ పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఏలూరు జిల్లా పరిధిలోకి వచ్చిందన్నారు. స్టేషన్‌లో పోలీస్ సిబ్బంది తక్కువగా ఉందని, వెంటనే సిబ్బందిని ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. అక్రమ గంజాయి రవాణా తగ్గిందని చెప్పారు. బెల్టుషాపులపై దృష్టి పెడదామని చెప్పారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి శ్రీనివాస్, నిడమర్రు సిఐ ఎంఇ సుభాష్, గణపవరం ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు, ఎఎస్ఐ జి.వరలక్ష్మి, రైటర్ డి.రత్నప్రసాద్ పాల్గొన్నారు.

వాతావరణంలో మార్పు.. రైతుల్లో వణుకు

ఆకివీడులో కోతకు సిద్ధమైన వరి చేను

ప్రజాశక్తి - ఆకివీడు

వాతావరణంలో మార్పు రావడంతో రైతు గుండెల్లో గుబులు మొదలైంది. శుక్రవారం రాత్రి నుంచి వాతావరణం మేఘావృతమైంది. మండలంలో వరి చేలు కోతకు సిద్ధమయ్యాయి. ఇప్పటికే దాళ్వా విత్తనాల కోసం సిద్ధం చేసిన చేలు కోత పూర్తయి పన మీద ఉన్నాయి. మరోపక్క సార్వా వరి చేలు కోతకు సిద్ధమయ్యాయి. మరో వారం పది రోజుల్లో వరి కోతలు పూర్తయి రైతు చేతికి ధాన్యం అందే సమయం ఆసన్నమైంది. ఈ దశలో వర్షం పడితే గింజ రాలిపోయే అవకాశం ఉంది. నిలబడిన గింజ కూడా వాన చినుకు దెబ్బకు మెత్తబడిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో కొనుగోలు చేసే నాధుడే కరువవుతాడు. ప్రభుత్వం కొనుగోలు చేసినా సగానికి సగం ధర కోత విధించే అవకాశం ఉంది. ఇప్పటికే రూ.వేలు పెట్టుబడి పెట్టిన రైతు పంట చేతకొస్తుందని కోటి ఆశలతో ఎదురుచూస్తున్నాడు.

ఆచంట : నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం అల్పపీడనంగా మారి తరువాత వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ చేస్తున్న హెచ్చరికలు రైతుల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తున్నాయి. శనివారం సాయంత్రం ఒక్కసారిగా మారిన వాతావరణంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 11,352 ఎకరాల్లో సార్వా రైతులు సాగు చేయగా, ఇప్పటివరకు సుమారు 25 శాతం మాత్రమే కోత పూర్తయినట్లు రైతులు చెబుతున్నారు. చేతికొచ్చిన పంట ఈదురుగాలులకు నేల వాలిపోతే ఎందుకు పనికిరాదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.25 వేలు వరకు పెట్టుబడులు పెట్టిన రైతులు చేతికందొచ్చిన పంట ఎక్కడ చేజారిపోతుందోనని ఆవేదన చెందుతున్నారు. ఎక్కువ మంది రైతులు కోత యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. ఈ కోత యంత్రాల వల్ల తేమ శాతం ఎక్కువగా ఉండటంతో దానిని తగ్గించుకోవడానికి ధాన్యాన్ని ఆరబెట్టుకునే పనిలో రైతులు ఉన్నారు. మరో 75 శాతం వరకు కోతలు కోయాల్సి ఉందని రైతులు చెబుతున్నారు. పంట దిగుబడి బాగున్నా వాతావరణం అనుకూలించకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాలకొల్లు : తుఫాన్ ప్రభావంతో పాలకొల్లు ప్రాంతంలో వాతావరణం శనివారం రకరకాలుగా మారింది. ఉదయం ఎండ వచ్చినా తరువాత మబ్బులుగా మారి చలిగాలులు పెరిగాయి. రైతులు ఆందోళన చెందుతున్నారు.

దగ్గరలో రైస్‌మిల్లుకు ధాన్యం తోలుకోవచ్చు

తుపాన్ నేపథ్యంలో రైతులకు వెసులుబాటు : మంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం : తుపాన్ నేపథ్యంలో రైతులు తమ ధాన్యాన్ని దగ్గరలో ఉండే రైస్ మిల్లుకు తోలుకునే వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం సాయంత్రం ఆయన మాట్లాడు తూ తుపాను ప్రభావంతో ఈ నెల మూడో తేదీ నుంచి ఐదో తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉందని వాతా వరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసు కుందన్నారు. రైతులు తమ ధాన్యాన్ని తమకు కేటాయించిన రైస్ మిల్లుకే తోలాల్సి వచ్చేదన్నారు. తుపాను నేపథ్యంలో ప్రభుత్వం ఆ నిబంధనను సడలించి తమకు దగ్గరలో ఉన్న ఏ రైస్‌మిల్లుకైనా తోలుకునే అవకాశం కల్పించిందన్నారు. ఇప్పటికే కోసి ఆరబెట్టిన ధాన్యాన్ని తక్షణమే తమ దగ్గరలోని రైస్ మిల్లులకు పంపించాలని సూచించారు. దీనికోసం సంబంధిత రైతు భరోసా కేంద్రంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను, విఆర్ఒను సంప్రదించాలని చెప్పారు.

ధాన్యం కొనుగోలుకు అన్ని విధాలా చర్యలు : జెసి

భీమవరం : జిల్లాలో కోసిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు. తుపాన్ హెచ్చరికల కారణంగా ధాన్యం కొనుగోలుపై జిల్లా సివిల్ సప్లై, రైస్ మిల్లర్స్ ప్రతినిధులతో స్థానిక కలెక్టరేట్‌లో శనివారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఇప్పటికే కోసి ఉన్న పంటను రైతు భరోసా కేంద్రాల ద్వారా అమల్లో ఉన్న నిబంధనల మేరకు తక్షణమే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని ఆదేశించారు. వరి కోతలు మూడు, నాలుగు రోజులు వాయిదా వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ కానాల సంగీత్‌మాధుర్, సివిల్ సప్లై జిల్లా మేనేజన్ టి.శివరామప్రసాద్, డిఎస్ఒ ఎన్.సరోజ, ఎఎస్ఒ ఎం.రవిశంకర్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.శ్రీరామరాజు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఆచంట (పెనుమంట్ర) : తుపాన్ నేపథ్యంలో రైతులు వరి పంటల కోతలు నిలిపివేయాలని జెసి రామ్‌సుందర్‌రెడ్డి సూచించారు. పెనుమంట్ర, బ్రాహ్మణచెరువు, భట్లమాగుటూరు, ఆలమూరు, ఓడూరు, వెలగలేరు రహదారి పక్కన రైతులు ఆరబెట్టిన వరి ధాన్యపు రాసులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 12,117 మంది రైతులు వరి సాగు చేస్తున్నారని, ఇప్పటివరకు 4500 టన్నులు మిల్లులకు ఎగుమతి కాగా 1500 టన్నులు ఎగుమతి కావాల్సి ఉందని చెప్పారు. మూడు వేల టన్నులు రైతుల వద్ద ఉందన్నారు. తుపాన్ నేపథ్యంలో రైతులు కోతలు నిలుపుకోవాలని సూచించారు. ఆయనతో పాటు తహశల్దార్ దండు అశోక్‌వర్మ, ఎఒ ఎ.జ్యోషిల, వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

పేరుపాలెం బీచ్‌లో పరిస్థితిని సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

'మిచౌంగ్'పై హైఅలెర్ట్

తుపాన్ హెచ్చరికలతో అధికారులు అప్రమత్తం

గంటకు 120 కిలోమీటర్లు వేగంతో గాలులు వీచే అవకాశం

ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, గజ ఈతగాళ్లు సిద్ధం

జిల్లాలో ఆరు బయటే 31 వేల టన్నుల ధాన్యం

కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో మిచౌంగ్ తుపాన్ పడగ ముసురుకుంది. తుపాన్ హెచ్చరికలతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. గంటకు 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని ప్రకటించారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు. రెండు రోజులపాటు జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా ప్రజలు తుపాన్ హెచ్చరికలను పాటిస్తూ అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, అధికారులు సమన్వయంతో పని చేయాలని హెచ్చరికలు జారీ చేశారు. శనివారం స్థానిక కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్‌పి యు.రవిప్రకాష్, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి సంయుక్తంగా అధికారులతో తుపాన్ హెచ్చరికలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిచౌంగ్ తుపాన్ ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. ఆదివారం మధ్యాహ్నం నుండి వర్షాలు ప్రారంభమై సోమవారం నాటికి భారీ వర్షాలుగా మారనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. తుపాను తీరం దాటే సమయంలో సుమారు గంటకు వంద కిలోమీటర్ల నుండి 120 కిలోమీటర్ల వరకు వేగంగా గాలులు వీయడంతోపాటు సముద్ర కెరటాలు ఒక మీటర్‌కుపైగా ఎగసిపేడే అవకాశం ఉందని తెలిపారు. నాలుగురోజులపాటు సముద్రంలోకి వేటకు వెళ్లడంగాని, సాధారణ ప్రజలు సముద్ర పరిసర ప్రాంతాలకు వెళ్లడంగాని పూర్తిగా నిషిద్ధమన్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. మున్సిపాల్టీల పరిధిలో శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి వాటిలో నివశిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. అవసరమైతే 144 సెక్షన్ కూడా విధిస్తామని స్పష్టం చేశారు. తాడేపల్లిగూడెం, నరసాపురం, మొగల్తూరు నేషనల్ హైవేలపై వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో తుపాన్ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, ఆయా మండలాల్లో ఇప్పటికే ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్ టీమ్‌లను, గజఈతగాళ్లను సిద్ధంగా ఉంచామని వివరించారు. పునరావాస కేంద్రాల వద్ద హెల్త్ క్యాంపులను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి మండలంలో అంబులెన్స్ పాయింట్ ఏర్పాటు చేసి 104 అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలన్నారు. అన్ని శాఖల సమన్వయంతో తుపాన్‌ను ఎదుర్కోవడానికి సంసిద్ధంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటికే కోసి ఉంచిన సుమారు 31 వేల టన్నుల ధాన్యాన్ని వెంటనే ఆర్‌బికెల ద్వారా మిల్లులకు తరలించాలని ఆదేశించారు. జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, స్థానిక అధికారులతో కలిసి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ సంగీత్‌మాధుర్, ఆర్‌అండ్‌బి, ఫైర్, పంచాయతీరాజ్, మెడికల్, సివిల్ సప్లయీస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

మిచౌంగ్ తుపాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. దీనిలో భాగంగా కలెక్టరేట్‌లో తుపాన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు అత్యవస సహాయం కోసం కంట్రోల్ రూమ్ నెంబర్ 08816-299219ను సంప్రదించాలని కోరారు. ఈ నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. సముద్రంలోకి మత్స్యకారులు వేటకు వెళ్లకూడదన్నారు. ఇప్పటికే వేటకు వెళ్లి ఉంటే తక్షణమే బయటకు రావాలని సూచించారు. బలహీనంగా ఉన్న ఏటిగట్లు, వంతెనలు తదితర ప్రాంతాల్లో ముందస్తు చర్యలకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

పేరుపాలెం బీచ్ సందర్శన

మొగల్తూరు: తీర ప్రాంతంలో తుపాను పట్ల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. శనివారం రాత్రి మండలంలోని పేరుపాలెం బీచ్‌ను జెసి రామ్‌సుందర్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్లపు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట ఆర్‌డిఒ ఎం.అచ్యుత్ అంబరీష్, తహశీల్దార్ జి.అనితకుమారి, ఎంపిడిఒ ఉండ్రు బాబ్జిరాజు, ఆర్ఐ శిరీష, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పోలీస్ పరేషాన్...!

కాగితాలకే పరిమితమైన వీక్లీఆఫ్ - ఖాకీలను తీవ్రంగా వేధిస్తున్న ప్రభుత్వ తీరు

కుటుంబంతో గడిపే సమయం కరువు - మరింత పెరిగిన రాజకీయ ఒత్తిళ్లు

టిఎ, సరెండర్ లీవుల సొమ్ము కోసం ఎదురుచూపులే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వ తీరు పోలీస్ సిబ్బందిని తీవ్రంగా బాధిస్తోంది. ఎండ, వాన, చలి అనే తేడా లేకుండా రాత్రీ పగలు విధులు నిర్వహించే పోలీసుల పట్ల ప్రభుత్వానికి కనీస కనికరం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. పోలీసులకు అమలు చేయాల్సిన కనీస సదుపాయాలపై ప్రభుత్వం పట్టించుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. తాము అధికారంలోకి వస్తే పోలీసులకు వీక్లీఆఫ్ అమలు చేస్తామంటూ వైసిపి ఎన్నికలకు ముందు అట్టహాసంగా ప్రకటించింది. అధికారంలోకొచ్చాక వీక్లీఆఫ్ అమలుకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు సైతం జారీ చేసింది. కానిస్టేబుల్ నుంచి ఎస్ఐ వరకూ వీక్లీఆఫ్ అమలవుతుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఎవరు, ఏ రోజు వీక్లీఆఫ్ తీసుకుంటారో వివరాలు స్టేషన్‌లో ఉంచాలని తెలిపారు. అదంతా మూణ్ణాళ్ల ముచ్చటగానే మారిపోయింది. వీక్లీఆఫ్ అనేది కాగితాలకే పరిమితమైంది. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన కొద్దిరోజులే వీక్లీఆఫ్ అమలైంది. తర్వాత పూర్తిగా పక్కన పెట్టేశారు. ఇప్పుడు పోలీస్ సిబ్బందికి వీక్లీఆఫ్ అనేది అమలు కావడం లేదు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎస్ఐ నుంచి కానిస్టేబుల్ వరకూ దాదాపు మూడు వేల మంది పోలీస్ సిబ్బంది ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. రాజకీయ నాయకుల పర్యటనలు, ఆందోళనలు, తమ స్టేషన్ పరిధిలో జరిగే నేరాల అదుపు వంటి పనులతో తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. కుటుంబంతో గడిపే సమయమే ఉండటం లేదు. వీక్లీఆఫ్ అమలు చేయాలని పోలీస్ సిబ్బంది ఎప్పటి నుంచో కోరుతున్నారు. వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు ప్రకటించినా ఆచరణలో గాలికొదిలేసింది. దీంతో పోలీస్ సిబ్బందికి వీక్లీఆఫ్ మళ్లీ కలగానే మారిపోయింది. గతంతో పోలిస్తే పోలీసులపై రాజకీయ ఒత్తిళ్లు మరింత పెరిగిన పరిస్థితి ఉంది. పోలీసులకు క్షణం తీరికలేని పరిస్థితి. వీక్లీ ఆఫ్ అమలు జరిగితే వారంలో ఒక్క రోజైనా కుటుంబంతో గడిపే అవకాశం ఉండేది. వీక్లీఆఫ్ అమలు చేయకపోవడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా పోలీసులకు అందించాల్సిన సదుపాయాలు కూడా ప్రభుత్వం సక్రమంగా అమలు చేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బకాయిలు ఇచ్చేదెప్పుడో..

ఎమర్జెన్సీ సర్వీస్‌గా ఉండే పోలీస్ వృత్తిలో సిబ్బందికి కొన్ని సౌకర్యాలు ఉన్నాయి. సరెండర్ లీవ్స్‌కు సంబంధించి ప్రతి పోలీస్ ఉద్యోగికి జీతంలోని బేసిక్‌లో సగం జీతం ఇవ్వాల్సి ఉంటుంది. ఏడాదిలో మూడుసార్లు ఇది వర్తింపజేస్తారు. దీనికి సంబంధించిన బకాయిలు ఏడాదికిపైగా ఉండటంతో సిబ్బంది లబోదిబోమంటున్నారు. ఇవి జిల్లాలవారీగా కొన్నిచోట్ల ఎక్కువ, మరికొన్నిచోట్ల తక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు. పోలీస్ సిబ్బంది బందోబస్తు వంటి అనేక కార్యక్రమాలకు వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. దీని నిమిత్తం నెలకు రూ.2,100 వరకూ టిఎ (రవాణా ఖర్చులు) కింద సిబ్బందికి ప్రభుత్వం చెల్లిస్తోంది. ఏడాదికిపైగా టిఎ బిల్లుల బకాయిలు సైతం పేరుకుపోవడంతో సిబ్బంది తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఇలా అనేక సమస్యలు పోలీస్ సిబ్బందిని వేధిస్తున్నాయి. 24 గంటలూ నిద్రాహారాలు మాని విధులు నిర్వహించే పోలీసుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలని అంతా కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పోలీస్ సిబ్బందికి ఇవ్వాల్సిన బకాయిలు విడుదల చేయడంతోపాటు, వీక్లీఆఫ్ అమలు చేయాలి. అప్పుడే పోలీసులకు ఎంతోకొంత మేలు చేసినట్లవుతుంది.

రజక వృత్తిదారుల పట్ల వివక్ష తగదు

రాష్ట్ర ఉపాధ్యక్షులు మడక రాజు

మాట్లాడుతున్న మడక రాజు

తాడేపల్లిగూడెం : రజక వృత్తిదారుల పట్ల నేటికీ కుల వివక్ష కొనసాగుతోందని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మడక రాజు తెలిపారు. తాడేపల్లిగూడెం అపరాల మార్కెట్ వర్కర్స్ యూనియన్ భవనంలో రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో పసుపులేటి శ్రీనివాస్ అధ్యక్షతన రజకుల సమస్యలు-పరిష్కార మార్గాలపై చర్చా వేదిక ఆహ్వాన సంఘ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు మడక రాజు మాట్లాడుతూ రజక వృత్తిదారుల పట్ల నేటికీ కుల వివక్ష కొనసాగుతుందని, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ లాగా సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెం పట్టణంలో ఆదివారం ఉదయం పది గంటలకు జరిగే ప్రదర్శన అనంతరం ఎస్‌కె గ్రౌండ్‌లో జరిగే రజకుల గర్జన సభకు రజక కుటుంబీకులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ గర్జన సభలో రజక పెద్దలు, ప్రొఫెసర్ సుబ్బారావు, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మున్నూరు భాస్కరయ్య, రజక కార్పొరేషన్ డైరెక్టర్ రేవూరు గోగురాజు, వివిధ సంఘాల నాయకులు, గ్రామ సర్పంచులు, రజకులు పాల్గొంటారని తెలిపారు. జిల్లా నాయకులు వద్దిపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ రజకులకు 50 ఏళ్లకే పింఛన్లు మంజూరు చేయాలని, ఇస్త్రీ చేసే వృత్తిదారులందరికీ 200 యూనిట్ల ఉచిత కరెంటు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పసుపులేటి శ్రీనివాస్, యండమూరి నాగేంద్ర, ఒద్దవోలు అన్నవరం, టేకి శ్రీనివాస్, వనాడు వీరభద్రం, ఊడిమూడ సత్యనారాయణ, అంప ఏడుకొండలు, మీసాల దుర్గారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెస్ పోటీల్లో గణేష్ ప్రతిభ

గోల్డ్‌మెడల్‌తో గణేష్

ప్రజాశక్తి - తణుకు రూరల్

తాడేపల్లిగూడెంలో మాస్టర్ మైండ్స్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి చెస్ పోటీల్లో తణుకు శశి పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న కె.శివసాయిగణేష్ గోల్డ్ మెడల్ సాధించినట్లు కోచ్ రూప శనివారం తెలిపారు. కోచ్ రూప బుద్ధ యోగా ఫౌండేషన్‌లో యోగా టీచర్‌గా పని చేస్తుంది. గణేష్‌కు చెస్ నేర్ప గా జిల్లా స్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించాడు. శిక్షణ ఇచ్చిన రూపను, గోల్డ్‌మెడల్ సాధించిన గణేష్‌ను పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు అభినందించారు.

ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రిజిస్టర్ తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - పాలకోడేరు

అధికారులు ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి సూచించారు. జిల్లాలో ఓటు నమోదు, ఓటర్ల జాబితాలో మార్పు, చేర్పులకు సంబంధించి రెండు రోజుల పాటు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్ సమర్ధవంతంగా జరుగుతుందన్నారు. పెన్నాడ అగ్రహారంలో జరుగుతున్న ప్రత్యేక డ్రైవ్‌ను కలెక్టర్ శనివారం అకస్మికంగా పరిశీలించారు. గ్రామంలో ఎంతమంది ఓటర్లు ఉన్నారు, పరిశీలనకు వచ్చిన అంశాలు ఏమిటి, చేర్పులు మార్పులు ఎంతమంది చేసుకుంటున్నారనే వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చిన అనంతరం రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో 20 మండలాలు, ఆరు మున్సిపాలిటీల్లో పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ సమర్ధవంతంగా జరుగుతుందని చెప్పారు. ముఖ్యంగా తమ ఓట్లు ఉన్నాయో లేవో పరిశీలించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఓటరు లిస్టులోని అన్ని రకాల సవరణలతో పాటు ఓట్ల బదిలీ చేసుకోవడానికి ఫారం-8 పూర్తి చేయాలన్నారు. కలెక్టర్‌తో పాటు భీమవరం ఆర్‌డిఒ శ్రీనివాసులురాజు, తహశీల్దార్ షేక్ హుస్సేన్, డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణరాజు, పంచాయతీ కార్యదర్శి కె.లక్ష్మి, పోలింగ్ బూత్ లెవెల్ అధికారులు ఉన్నారు.

యువ ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టాలి

భీమవరం : ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం ద్వారా పెద్ద మొత్తంలో చేర్పులు, మార్పులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బిఎల్‌ఒలు రిజిస్టర్లు, క్లెయిములు, దరఖాస్తులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. 18 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని ఆదేశించారు. ప్రత్యేక నమోదు కార్యక్రమంలో ప్రధానంగా దీని పైనే దృష్టి సారించాలని సూచించారు. డోర్ టు డోర్ సర్వేను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి ఇంటికీ బిఎల్‌ఒలు తప్పనిసరిగా వెళ్లి సర్వే చేయాలని ఆదేశించారు. మరణించిన ఓటర్ల ఇళ్లకు వెళ్లి, నోటీసులు ఇచ్చి వారి పేర్లను తొలగించాలని ఆదేశించారు.

సవాళ్లు.. ప్రతి సవాళ్లతో

దద్దరిల్లిన మండల సమావేశం

మండల పరిషత్ సమావేశంలో వాదులాడుకుంటున్న అధికార, ప్రతిపక్ష సభ్యులు

ప్రజాశక్తి - వీరవాసరం

సవాళ్లు...ప్రతి సవాళ్లతో వీరవాసరం మండల పరిషత్ సమావేశం దద్దరిల్లింది. ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని అధ్యక్షతన ఎంపిడిఒ జ్యోతి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మండల పరిషత్ సమావేశంలో నువ్వెంతంటే నువ్వెంత అనే స్థాయిలో టిడిపి ఎంపిటిసి కొల్లేపర శ్రీనివాసరావు, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబుల మధ్య తీవ్ర వాగ్వివాదాలు చోటుచేసుకున్నాయి. రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో వైసిపి నాయకులు ఓట్లు అడగవచ్చా అంటూ ఎంపిటిసి శ్రీనివాసరావు ఎంపిడిఒను సమాధానం చెప్పాలని కోరారు. దీనికి వైసిపి సర్పంచి ఓంకారం అడ్డు తగటడంతో గొడవ మొదలై ఒక్కసారిగా ఘర్షణ వైఖరి చోటు చేసుకుంది. పరిస్థితి చేదాటిపోతుందనుకున్న సమయంలో పోలీసులు రంగ ప్రవేశం చేయడం, టిడిపి ఎంపిటిసి శ్రీనివాసరావును తోటి సభ్యులు బయటకు తీసుకుపోవడంతో గొడవ సర్దుమనిగింది. ముఖ్య అతిథిగా వచ్చిన ఎఎంసి ఛైర్మన్ పట్ల టిడిపి ఎంపిటిసి కించపరిచే విధంగా మాట్లాడడం తప్పంటూ క్షమాపణ చెప్పాలంటూ వైసిపి సభ్యులు పట్టు పడటంతో సమావేశం ముందుకుసాగే పరిస్థితులు లేకుండా పోయాయి. దీంతో ఎంపిపి వీరవల్లి దుర్గభవాని కలుగజేసుకుని సమావేశంలో జరిగిన సంఘటనలు దురదృష్టకరమని, పశ్చాతాపం వ్యక్తం చేస్తున్నానని, సమావేశానికి సహకరించాలని కోరడంతో వాదులాటకు తెర పడింది. ఆ తరువాత సమావేశంలో శాఖల వారీ సమీక్ష నిర్వహించారు. దాళ్వా సాగుకు సాగునీటి కొరత ఉండదంటూ ఇరిగేషన్ ఎఇ సమావేశంలో ప్రకటించారు. మార్చిలోగా పంట కాలం పూర్తయ్యేట్లు సాగుకు సిద్ధం కావాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత సరళతరం చేయాలని, ఎండ్ల బళ్లను ఆన్‌లైన్ చేయించుకుంటేనే రవాణకు అనుమతి నిబంధనలు తొలగించాలని టిడిపి, జనసేన ఎంపిటిసిలు వ్యవసాయాధికారిణి బిన్నిబాబు, సివిల్ సప్లై ఆర్ఐ సురేష్ దృష్టికి తీసుకొచ్చారు. బిఎల్‌ఒలు ఓటర్ల జాబితా పరిశీలన సక్రమంగా నిర్వహించడంలేదంటూ ఎంపిటిసి సభ్యులు శ్రీనివాసరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటానని తహశీల్దార్ సుందరరాజు తెలిపారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు గుండా జయప్రకాష్‌నాయుడు, ఎంపిటిసి సభ్యులు గుళ్లిపల్లి విజయలక్ష్మి, ఇందిర, వెంకటలక్ష్మి, విజయకుమారి, అడ్డాల రాము, బొల్లెంపలి శ్రీనివాస్‌చౌదరి, సర్పంచులు గెడ్డం భారతి, పరమేశ్వరావు, లీలాకృష్ణ పాల్గొన్నారు.

రూ.55.5 లక్షల అభివృద్ధి పనులకు తీర్మానం

వీరవాసరం మండలంలో వివిధ గ్రామాల్లో రూ.55.5 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు మండల పరిషత్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. వీటితో పాటు వడ్డిగూడెం, అండలూరు గ్రామాలకు కూడా నిధులు కేటాయిస్తూ అనుబంధ ఎజెండాను సమావేశంలో ఆమోదించారు. వీరవాసరం, మత్స్యపురి, కొణితివాడ గ్రామాలకు సంబంధించి గతంలో కేటాయించిన పనులకు పంచాయతీల నుంచి తీర్మానం లభించకపోవడంతో ఈ దఫా నిధులు కేటాయించలేని పరిస్థితి ఉందని ఎంపిపి తెలిపారు.

బాలోత్సవం విజయవంతం చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 30, 31వ తేదీల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న భీమవరం బాలోత్సవం కార్యక్రమం విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో భీమవరం బాలోత్సవం-1వ పిల్లల సంబరాలు కార్యక్రమల ఏర్పాట్ల సన్నాహక సమావేశం యుటిఎఫ్ జిల్లా కోశాధికారి ని హెచ్.వట్టా భి రామయ్య అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ బాలోత్సవం జయప్రదానికి యుటిఎఫ్ డివిజన్ మండల బాధ్యులు, నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ కెవి రామభద్రం, బాలోత్సవం కమిటీ సభ్యులు సీతారామరాజు, అరుణ్, ధనుష్, జెవివి జిల్లా అధ్యక్షులు ప్రసాదరావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు ఏసుబాబు, రామకృష్ణ ప్రసాద్, కుమార్ బాబ్జి, భీమవరం, కాళ్ల, ఉండి బాధ్యులు అబ్రహం, నాగబాబు, స్వామి, శంకరరావు శామ్యూల్‌రాజు పాల్గొన్నారు.

సుందరవనంగా పేరుపాలెం బీచ్

ప్రజాశక్తి - మొగల్తూరు

పర్యాటకులను ఆకట్టుకునే విధంగా పేరుపాలెం బీచ్ సుందరవనంగా తీర్చిదిద్దుతున్నామని ప్రభుత్వ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని పేరుపాలెం, కెపి.పాలెం బీచ్‌లో కోటి రూపాయలతో నిర్మిస్తున్న కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహం పార్కును శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేరుపాలెం బీచ్‌కు వచ్చే పర్యాటకులకు ఏ విధమైన అసౌకర్యానికి గురికాకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆయనతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు కర్రి ఏసుబాబు, దొంగ సత్యనారాయణ, కటికల సూర్యనారాయణ, అల్లం చిన్న, లోకం నాని, రేవు రాంబాబు ఉన్నారు.

పోలింగ్‌బూత్‌ల పరిశీలన

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

18 ఏళ్ళ నిండిన యువత ఓటును నమోదు చేసుకోవాలని ఎంపిడిఒ పి.పద్మజ, తహశీల్దార్ దండు అశోక్ అన్నారు. మండలంలోని మార్టేరు, ఆలమూరు, భట్లమాగుటూరు, ఓడూరు, మల్లిపూడి, సోమరాజు ఇల్లింద్రపర్రు నెగ్గిపూడి, పెనుమంట్రలతో పాటు ఆయా పోలింగ్ కేంద్రాలను వారు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా బిఎల్‌ఒలు నమోదు కార్యక్రమం సక్రమంగా చేస్తున్నట్లు తెలిపారు. ఓటు నమోదు కార్యక్రమంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - యలమంచిలి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చించినాడ సర్పంచి దంగేటి రాజమణి అన్నారు. మండలంలోని చించినాడ గ్రామంలో పాలకొల్లు ప్రాజెక్టు ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన బేటీ బచావో-బేటీ పఢావో కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సర్పంచి రాజమణి మాట్లాడుతూ గతంతో పోలిస్తే బాల్య వివాహాలు చాలావరకు తగ్గుముఖం పట్టినప్పటికీ అక్కడక్కడ ఇంకా జరుగుతూనే ఉన్నాయన్నారు. బాల్య వివాహాలు జరిపిస్తున్నట్లు ఎవరి దృష్టికి వచ్చినా మహిళా పోలీసులు గాని, స్కూల్ ప్రధానోపాధ్యాయులకు గాని సమాచారం అందించాలని గ్రామస్తులను ఆమె సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు నల్లి సంధ్యారాణి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు రజని, భారతి, సుజాత, సత్య జ్యోతి పాల్గొన్నారు.

దేవాంగుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - ఆచంట

దేవాంగుల సంక్షేమానికి కృషి చేస్తామని ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ తెలిపారు. మండలంలోని కోడమంచిలి పవర్‌పేటలో దేవాంగుల వన సమారాధన కార్యక్రమం శనివారం నిర్వహించారు. దేవాంగుల కుల పెద్ద వట్టి ముత్యాలు, సరస్వతి దంపతులను సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుంకర సీతారామ్ మాట్లాడుతూ దేవాంగుల సమస్యల పరిష్కారం కోసం ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో దేవాంగుల సంఘం జిల్లా కోశాధికారి అల్లాడ కుమారస్వామి, ఎంపిటిసి సభ్యులు యల్లమెల్లి బేబీ రాజేష్, ఉప సర్పంచి మూలగాడ వరప్రసాద్, రైతు సంఘం అధ్యక్షులు సుబ్బారావు, దేవాంగుల సంఘం నాయకులు మావూరి నాగరాజు, మల్లిపెద్ది నాగయ్య, మల్లిపెద్ది అప్పారావు, మల్లిపెద్ది ఆదినారాయణ, నల్ల సూర్యనారాయణ, జాడ పోలయ్య పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత బ్యూటీషియన్ శిక్షణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక 3ఎఫ్ ఇండస్ట్రీస్ వారి రామేశ్వర్ బాలకృష్ణ గోయంకా ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఎలైట్ ఎడ్యుకేషన్ సొసైటీ వారిచే మహిళలకు ఉచిత బ్యూటీషియన్ శిక్షణా శిబిరాన్ని శనివారం రమాదేవి గోయంకా సేవా కేంద్రంలో ప్రారంభించారు. ఈ శిక్షణకు పరిసరాల ప్రాంతాలైన రాచర్ల, ప్రత్తిపాడు, తాడేపల్లిగూడెం నుంచి 35 మంది మహిళలు వచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 3ఎఫ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ ఓం ప్రకాష్ గోయంకా, సీమా గోయంకా, పి.రస్తోగి, వైస్ ప్రెసిడెంట్ జనార్ధన్, హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ వేమాల శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్ జి.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ట్రైనర్ సనా బ్యూటీషియన్ శిక్షణ ఆవశ్యకత గురించి వివరించారు. సుమారు 35 మంది మహిళలు శిక్షణ పొందుతున్నట్లు అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 10 మంది ఎంపిక

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాలలో హెటెరో డ్రగ్స్ ఫార్మా కంపెనీలో క్యుఎ/క్యుసి ప్రొడక్షన్ విభాగాల్లో ఉద్యోగాల ఎంపికలో జిల్లా వ్యాప్తంగా 30 మంది హాజరవ్వగా పది మంది ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన ప్రారంభ సభలో ప్రిన్సిపల్ మాట్లాడారు. సభకు అతిథిగా శ్రీ సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ ప్రొఫెసర్ బి.ఆండాళ్లు హాజరయ్యారు. హాజరైన విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్ష, మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులను అభినందించి ఆఫర్ లెటర్స్ అందించారు. ఈ ప్రాంగణ ఎంపికల్లో కళాశాల జెకెసి కో-ఆర్డినేటర్ కె.భద్రాచలం, డాక్టర్ వి.యామిని, జెకెసి ట్రైనర్ ఎం.కిరణ్‌కుమార్, పి.శ్రీనివాసరావు, హెటెరో హెచ్‌ఆర్.విజయ్ పాల్గొన్నారు.

'బాధితులకు అండగా టిడిపి'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

బాధితులకు టిడిపి ఎప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జి) అన్నారు. మండలంలోని మోదుగుంట గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇంటిని కోల్పోయిన బాధితులను ఆయన శనివారం పరామర్శించారు. బియ్యం, బట్టలు, వంట సామగ్రి అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి పరిమి రవికుమార్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పోతుల అన్నవరం, రాష్ట్ర నాయకులు వాడపల్లి సుబ్బరాజు, పసలపూడి రాంబాబు, చిటికెన రాములు, గరగా మాణిక్యం, కామన శ్రీను పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సచివాలయాలు

ప్రజాశక్తి - గణపవరం

గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి సచివాలయాలు కీలక పాత్ర వహిస్తున్నాయని ఎంఎల్‌ఎ పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు. అగ్రహార గోపవరంలో రూ.43 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల మధ్యలో సచివాలయం ఉండటం వల్ల స్థానికులు సమస్యల పరిష్కారానికి దూరంగా వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పాఠంశెట్టి పద్మావతిశ్రీనివాస్, మండల పరిషత్ అధ్యక్షులు దండు వెంకట రామరాజు (అర్ధవరం రాము), జెడ్‌పిటిసి సభ్యులు దేవవరపు సోమలక్ష్మి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

బలరామరాజు సేవలు మరువలేనివి

సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి - కాళ్ల

మనసున్న మహారాజు గోకరాజు బలరామరాజు సేవలు మరువలేనివని మాజీ ఎంపీలు కనుమూరి బాపిరాజు, గోకరాజు గంగరాజు అన్నారు. మండలంలోని జువ్వలపాలెం గ్రామంలో గోకరాజు బలరామరాజు సంస్మరణ సభను శనివారం నిర్వహించారు. గోకరాజు బలరామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ జువ్వలపాలెం గ్రామాభివృద్ధికి గోకరాజు బలరామరాజు 18 ఏళ్ల పాటు సర్పంచిగా ఎన్నో సేవలందించారని కొనియాడారు. గ్రామాభివృద్ధి కోసం నిస్వార్థంగా సేవలందించారన్నారు. ఆదర్శవంతమైన నాయకులని గుర్తు చేశారు. బలరామరాజు గ్రామాభివృద్ధికి చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. సిబి సిఎన్‌సి బాప్టిస్ట్ చర్చి సంఘస్తులు అందించిన బలరామరాజు చిత్రపటాన్ని టిటిడి మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు ఆవిష్కరించి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. డిఎన్‌ఆర్ కళాశాల అధ్యక్షులు గోకరాజు నరసింహరాజు, గోకరాజు పెద్ద బుజ్జి, గోకరాజు రామరాజు, మాజీ సర్పంచి గోకరాజు పెద్దబాబు, ఎంపిటిసి సభ్యులు మీసాల శ్రీనివాస్, ఉప సర్పంచి కతారి లక్ష్మీపతిరాజు, మాజీ ఉప సర్పంచి గోకరాజు వినోద రంగరాజు, గోకరాజు వెంకట బలరామకృష్ణంరాజు, సిరీస్ రామరాజు, సరిపల్లి సూరిబాబు, కలిదిండి గోపాలకృష్ణంరాజు, పి.గోపాలకృష్ణంరాజు, రుద్రరాజు రామకృష్ణంరాజు, మండల కో-ఆప్షన్ సభ్యులు బెనహార్ నివాళులర్పించారు.

బలరామరాజుకు నివాళులర్పిస్తున్న వక్తలు

అన్నదాన కార్యక్రమం

పేదల సొంతింటి కలను నిజం చేస్తున్నాం

రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం నియోజకవర్గంలో పేదల సొంతింటి కలను నిజం చేస్తున్నామని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మున్సిపాలిటీ, హౌసింగ్ అధికారులతో స్థానిక ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణాలపై శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గంలో సుమారుగా 12 వేల మందికి పైగానే పేదలకు ఇళ్ల స్థలాలను మంజూరు చేసి, వారికి పట్టాలిచ్చి గిహ నిర్మాణాల నిమిత్తం ఉచితంగా రూ.1.80 లక్షలు ఇవ్వడంతో పాటు, లబ్ధిదారుల ఇష్టం మేరకు గృహ నిర్మాణాలకు బ్యాంకుల ద్వారా రూ.35 వేలు రుణం ఇప్పిస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు గృహ నిర్మాణాలకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని త్వరితగతిన గృహ నిర్మాణాలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. విస్సాకోడేరు జగనన్న లే అవుట్ లో లబ్ధిదారులు వేగవంతంగా గృహాలు నిర్మించుకోవడం సంతోషకరమన్నారు. పేదలకు స్థలాలు, గృహాల మంజూరు అనేది నిరంతర ప్రక్రియ అన్నారు. అర్హులు ఎప్పుడైనా కూడా దంఖాస్తు చేసుకుంటే 90 రోజుల్లోగా వారికి అర్హతను బట్టి ప్రభుత్వం స్థలం కేటాయిస్తుందన్నారు. విస్సాకోడేరు జగనన్న లే అవుట్‌లో మిగిలిన భూమికి కూడా మట్టి పూడిక చేస్తామన్నారు. తాడేరు, నరసింహపురం, కొవ్వాడ అన్నవరం, చినఅమిరం, రాయలం గ్రామాల్లో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పూర్తిగా పరిష్కరించామని, త్వరలోనే వీరికి స్థలాలను అప్పగించి, త్వరిత గతిన గృహాలు నిర్మించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమీక్షలో మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, తారక రామ కన్‌స్ట్రక్షన్ ఛైర్మన్ పళ్ల ఏసుబాబు, హౌసింగ్ ఎఇలు శశికుమార్, శ్రీనివాస్, మూర్తి, పంచాయతీ కార్యదర్శి కిషోర్ పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్

తుపాన్ నేపథ్యంలో ప్రజల్లో అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఆచంట

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం మరింత బలపడి తీవ్ర తుపాన్‌గా మారనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆచంట ఎస్ఐ రాజకుమార్ అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యంగా మత్స్యకారులు గోదావరిలోకి వేటకు వెళ్లవద్దని సూచించారు. ఈశాన్య దిశలో 710 కిలోమీటర్ల దూరంలో బంగాళాఖాతంలో ఉన్న తీవ్ర వాయుగుండం ఈ నెల మూడో తేదికి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉంటుందన్నారు. దీని ప్రభావం మండలంపై ఎక్కువగా చూపే అవకాశం ఉంటుందన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అవసరమైన ప్రాంతాల్లో సహాయక శిబిరాలకు వెళ్లాలని, అధిక వర్షాల వల్ల గోదావరి ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉన్న నదీ పరివాహక లంక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఆపదలో ఉన్న ప్రజలను రక్షించడానికి పోలీస్ శాఖ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం కోసం 100 ఫోన్ చేయాలని తెలిపారు.

అత్తిలి :తుపాను నేపథ్యంలో మూడు రోజుల పాటు కోతలు వాయిదా వేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి డిటిహెచ్ఒ మురళీకృష్ణ సూచించారు. మండలంలోని పాలూరు, కంచుమర్రు, స్కిన్నేరపురం గ్రామాల్లో వరి పంటలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ టికె.రాజేష్ మాట్లాడుతూ కోసిన వరి పంట ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని రైతులకు సూచించారు. ఆయనతో పాటు తహశీల్దార్ రామాంజనేయులు, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

అత్తిలి : రైతులతో మాట్లాడుతున్న అధికారులు

ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజుకు కాపు సంఘం నాయకుల సత్కారం

ప్రజాశక్తి - పోడూరు

ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజును కాపు సంఘం నాయకులు శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో సత్కరించారు. మండలంలోని పోడూరు గ్రామంలో కాపు కళ్యాణ మంటపం నిర్మాణం నిమిత్తం రూ.25 లక్షలు మంజూరు చేసినందుకు ఈ సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి శెట్టిబత్తుల సువర్ణరాజు, చేకూరి సూరిబాబు, సొసైటీ అధ్యక్షులు శివాజీరాజు, వైస్ ఎంపిపి ఇందుకూరి సీతారామరాజు, అడపా శంకరం, జడ్డు చిన జోగేశ్వరరావు, రేకపల్లి నాగరాజు పాల్గొన్నారు.

అవినీతికి రాజు జగన్

మాజీ మంత్రి పితాని

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

జగన్ అవినీతికి రాజైతే, స్థానిక ఎంఎల్‌ఎ అవినీతికి రారాజు అని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు పితాని సత్యనారాయణ అన్నారు. మండలంలోని మల్లిపూడి, జుత్తిగ గ్రామాల్లో టిడిపి, జనసేన ఆధ్వర్యంలో శనివారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ మాట్లాడుతూ మల్లిపూడి సర్పంచి దొంగ మహాలక్ష్మిని కావాలని చెక్ పవర్ రద్దు చేయించారని విమర్శించారు. పంచాయతీ ఆవరణలో ఉన్న టేకు చెట్లు అమ్మేసిన ఘనత వైసిపి నాయకులకు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మల్లిపూడి గ్రామ అధ్యక్షుడు గుడిమెట్ల మార్కండేయరెడ్డి, గుడిమెట్ల సుందర్ రామిరెడ్డి, గుడిమెట్ల సత్యనారాయణరెడ్డి, దండు రామరాజు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి : సిపిఐ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తుపాన్ కారణంగా జిల్లాలో సార్వా రైతాంగం పంట నష్టపోకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని, రైతాంగానికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. మండలంలోని కొత్త పూసలమూరు గ్రామంలోని తిరుమాని కామేశ్వరరావు నివాసంలో సిపిఐ గ్రామ శాఖ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ తేమ అధికంగా ఉందనే సాకుతో మిల్లర్లు తక్కువ ధరకే ధాన్యం కొనుగోలు చేసే పరిస్థితులు నివారించి రైతులను ఆదుకోవాలని కోరారు.

గణేష్‌కు మాతృవియోగం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణ దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు వట్టం గణేష్ తల్లి సుందరమ్మ (70) శనివారం మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, పలువురు టిడిపి నేతలు పరామర్శించి తమ సంతాపం తెలిపారు. పాలకొల్లు క్లాత్ మర్చంట్స్ సభ్యులు ఆమె మృతదేహాన్ని సందర్శించి గణేష్, భాస్కరరావు కుటుంబ సభ్యులకు తమ సంతాపం తెలిపారు.

కవిటంలో 'హౌసింగ్ డే'

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని కవిటం గ్రామంలో జగనన్న లే అవుట్‌లలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు శనివారం పర్యటించారు. హౌసింగ్ డే సందర్భంగా పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లే అవుట్‌లలో మొత్తం 271 మంది లబ్ధిదారులు ఉన్నారని, 78 ఇళ్ల పూర్తయ్యాయని, 89 ఇళ్ళు వివిధ దశల్లో ఉన్నాయని, 104 ప్లాట్‌లలో ఇళ్ల ప్రారంభించలేదని చెప్పారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని, ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఆయనతో పాటు ఆర్ఐ కందుల రాంబాబు, హౌసింగ్ ఇన్‌స్పెక్టర్ వి.జయరాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ సన్నిధిలో రాష్ట్ర ఎన్నికల డిప్యూటీ సిఇఒ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరంలో ఉన్న మావుళ్లమ్మను రాష్ట్ర ఎన్నికల డిప్యూటీ సిఇఒ ఆదూరి వెంకటేశ్వరరావు కుటుంబసమేతంగా శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేదాశీర్వచనం అందించారు. వీరికి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ అమ్మవారి ప్రసాదాన్ని అందించారు.

కోర్టు సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నరసాపురం కోర్టుల భవనంలో భీమవరం డాక్టర్ కేర్ హోమియోపతి సహకారంతో ఉచిత మోమియోపతి వైద్య శిబిరం, గవర్నమెంట్ ఏరియా ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. నరసాపురం కోర్టుల్లో పనిచేసే న్యాయ సిబ్బంది, న్యాయవాదులు, న్యాయవాద గుమాస్తాలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పదో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ పి.విజయదుర్గ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు, సంస్థ సభ్యులు చల్లా దానయ్యనాయుడు, ఉచిత న్యాయవాదులు దొంగ నరసింహరాజు, నారిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోర్టు సిబ్బందిని పరీక్షిస్తున్న వైద్యులు

అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారి పుట్టినరోజు వేడుక

కేక్ కట్ చేస్తున్న చిన్నారి

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు పుట్టినరోజు వేడుకలు చేసుకోవడం శుభపరిణామమని పెనుమంట్ర కోడ్-5 అంగన్‌వాడీ కార్యకర్త సుబ్బాయమ్మ తెలిపారు. పెద్ద చెరువు గట్టు అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్న వడ్డీ గగన్ కార్తికేయ పుట్టినరోజు వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తికేయ తల్లిదండ్రులు మేరా సాయి శ్రీ, సురేష్ చిన్నారులకు ప్లేట్లు, పెన్సిళ్లు అందించారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్ పి.శ్రీకాంత్ అన్నారు. తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ వంగపండు రామ్మోహనరావు ఆధ్వర్యంలో లయన్ గరికిపాటి భావయ్యశర్మ ఆర్థిక సహకారంతో కడకట్ల జనతా ఛారిటబుల్ ట్రస్ట్ హాస్పిటల్‌లో శనివారం నిర్వహించిన ఉచిత షుగర్ రక్త పరీక్ష శిబిరాన్ని శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ శిబిరంలో మొత్తం 90 మందికి ఉచిత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ చిన్నం జగదీష్, జీడిగుంట హరిబాబు, నాగేశ్వరరావు, పచ్చా వెంకటేశ్వరరావు, భావయ్యశర్మ పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో కోర్టు సేవలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరంలోని మూడో అదనపు జిల్లా కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు, ఆఫీస్ కార్యకలాపాలు ప్రభుత్వ ఆసుపత్రి దగ్గరలోని సివిల్ కోర్టు కాంప్లెక్స్ నుంచి బిఎస్ఎన్ఎల్ కార్యాలయం మొదటి, రెండో అంతస్తులకు మార్చినట్లు పట్టణ మూడో అడిషనల్ జిల్లా జడ్జి పి.సత్యదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల నాలుగో తేదీ నుంచి బిఎస్ఎన్ఎల్ కార్యాలయ ప్రాంగణం నుంచే కోర్టు సేవలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

సిఎస్‌సి వర్క్‌షాపులో ఎస్ఆర్‌కెఆర్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సీనియర్ విద్యార్థులు ఖరీదైన నూతన టెక్నాలజీని జూనియర్లకు అందించి స్ఫూర్తిగా నిలవడంలో, వారిలో పోటీతత్వాన్ని, నూతన టెక్నాలజీపై ఆలోచన కలిగించేలా చేయడంలో భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు చేసిన కృషి అభినందనీయమని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు అన్నారు. రెండేళ్లగా రూ.వేలు వెచ్చించి మిషన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఒటి) అధ్యాయం చేసిన ఫైనలియర్ సిఎస్‌సి విద్యార్థులు ప్రస్తుత రెండో సంవత్సరం విద్యార్థులకు ఎటువంటి రుసుము లేకుండా, సమయం వృధా కాకుండా రెండు రోజులు శిక్షణ అందించారని ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు అన్నారు. సిఎస్ఇ సెమినార్ హాలులో సిఎస్‌సి హెడ్ డాక్టర్ వి.చంద్రశేఖర్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్స్ ఇచ్చిన శిక్షణలో నైపుణ్యం సాధించి కొత్త ప్రాజెక్టుల రూపొందించిన విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం చేశారు. ఈ సందర్భంగా సిఎస్‌సి హెడ్ డాక్టర్ వి.చంద్రశేఖర్ మాట్లాడుతూ సిఎస్‌సి స్టూడెంట్స్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్క్‌షాపులో 523 మంది విద్యార్థులు పాల్గొని 83 ప్రాజెక్టులు రూపొందించారని వివరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌కె.కామేశ్వరరావు, డాక్టర్ మహేష్, డాక్టర్ కవిత, ఆర్.శివశంకర్ పాల్గొన్నారు.

వర్క్ షాపులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం, కటారి నగర్, డోర్ నెం. 19-20-5, సంకా వాసవి సత్య వినేష్, S/o. వీర వెంకట నాగేశ్వరరావు అను నా యొక్క పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెం. **V2598557.** ది. 22-11-2023వ తేదీన నా ఇంటి వద్ద నుండి తాలూకా ఆఫీసు వద్ద గల జిరాక్స్ షాపునకు జిరాక్స్ తీసుకొను నిమిత్తం మోటారు సైకిల్‌పై వచ్చుచుండగా మార్గ మధ్యలో నా ఒరిజినల్ పాస్‌పోర్టు ఉన్న కవర్ పడిపోయినది. దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

సంకా వాసవి సత్య వినేష్
S/o. వీర వెంకట నాగేశ్వరరావు
డోర్ నెం. 19-20-5, కటారి నగర్
భీమవరం, ప॥గో॥జిల్లా
సెల్: 83285 89788

మహారాజశ్రీ గౌరవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా
ఐ.ఎ. నెం. 622/2022 ఇన్ ఒ.ఎస్. 45/2017

Between:
PETITIONERS/ DEFENDANTS:
1. BASF India Ltd., Regd. Office at the Capital, 'A' Wing, 1204-C, 12th Floor, Plot No. C-70, 'G' Block Bandra Kurla Complex, Bandra (East) Mumbai 400051. Rep. by its athorized signatory Tejal Bhavin Panchamia, W/o. Bhavin Vinod Panchamia, aged 42 years, Manater Legal.
2. Ashok John Kosky, S/o. late E.J.Koshy, aged 45 years, Employee, C/o. The Capital, 'A' Wing, 1204-C, 12th Floor, Plot No. C-70, 'G' Block, Bandra Kurla Complex, Bandra (East) Mumbai 400051.

RESPONDENT/ PLAINTIFF:
Jagarlamudi Ramprasad, S/o. Nageswara Rao, Hindu, Male, aged 41 years, R/o. D.No. 2-15, Kamavarapukota Village and Mandal, W.G.Dist.,

పై నెంబరు ఐ.ఎ.లో గల దావాలో మీరు అనగా జాగర్లమూడి రామ్‌ప్రసాద్ గారు రెస్పాండెంట్ అయివున్నారు. మీకు కోర్టు వారు ఎన్నిమార్లు నోటీసులు పంపినా మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున **ది. 28-12-2023వ తేదీన మీరు గాని, లేక మీ లాయర్ గారి ద్వారా గాని ఉదయం 10.30 గంటలకు** కోర్టు వారి ఎదుట హాజరు అయి మీ సంజాయిషీ తెలుపుకొనగలరు. లేని ఎడల మీ పరోక్షంలో పై నెంబరు గల ఐ.ఎ. తీర్మానించబడును.

యస్.రఘురామ్
యమ్.ప్రభాకర్
పి.కె.డి.భవాని, అడ్వకేట్స్, ఏలూరు
సెల్: 8520811119, 9440114136

మహారాజశ్రీ గౌరవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా
ఐ.ఎ. నెం. 623/2022 ఇన్ ఒ.ఎస్. 45/2017

Between:
PETITIONERS/ DEFENDANTS:
1. BASF India Ltd., Regd. Office at the Capital, 'A' Wing, 1204-C, 12th Floor, Plot No. C-70, 'G' Block Bandra Kurla Complex, Bandra (East) Mumbai 400051. Rep. by its athorized signatory Tejal Bhavin Panchamia, W/o. Bhavin Vinod Panchamia, aged 42 years, Manater Legal.
2. Ashok John Kosky, S/o. late E.J.Koshy, aged 45 years, Employee, C/o. The Capital, 'A' Wing, 1204-C, 12th Floor, Plot No. C-70, 'G' Block, Bandra Kurla Complex, Bandra (East) Mumbai 400051.

RESPONDENT/ PLAINTIFF:
Jagarlamudi Ramprasad, S/o. Nageswara Rao, Hindu, Male, aged 41 years, R/o. D.No. 2-15, Kamavarapukota Village and Mandal, W.G.Dist.,

పై నెంబరు ఐ.ఎ.లో గల దావాలో మీరు అనగా జాగర్లమూడి రామ్‌ప్రసాద్ గారు రెస్పాండెంట్ అయివున్నారు. మీకు కోర్టు వారు ఎన్నిమార్లు నోటీసులు పంపినా మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున **ది. 28-12-2023వ తేదీన మీరు గాని, లేక మీ లాయర్ గారి ద్వారా గాని ఉదయం 10.30 గంటలకు** కోర్టు వారి ఎదుట హాజరు అయి మీ సంజాయిషీ తెలుపుకొనగలరు. లేని ఎడల మీ పరోక్షంలో పై నెంబరు గల ఐ.ఎ. తీర్మానించబడును.

యస్.రఘురామ్
యమ్.ప్రభాకర్
పి.కె.డి.భవాని, అడ్వకేట్స్, ఏలూరు
సెల్: 8520811119, 9440114136

వేలం ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. No. 55/2023 in O.S. No. 172/2006

Between:
తిరుపతి నారాయణరావు -వాదులు
Vs
చిట్రోజు శ్రీరామమూర్తి వగైరా -ప్రతివాదులు

పై నెంబరు పిటిషనులో పిటిషనరు/ డిక్రీ హోల్డర్ తనకు రావలసిన డిక్రీ బాకీ వసూలు నిమిత్తము రెస్పాండెంట్లు/ జడ్జిమెంటు డెటార్లు పైన (ప్రతివాద్లు) పై నెంబరు పిటీషను దాఖలు చేసినందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు రెస్పాండెంట్లు/ జడ్జిమెంటు డెటార్లుకు చెందిన ఈ దిగువ తెలిపిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పైన తెలిపిన కోర్టులో **ది. 20-12-2023వ తేదీన ఉదయం గం॥ 10.30 నిమిషములకు** బహిరంగముగా వేలము వేయుదురు. గాన కావలసినవారు వచ్చి కోర్టు వారి షరతులకు లోబడి పాడుకొనవలసినదిగా తెలియపరచడమైనది.

SCHEDULE
West Godavari District, Bhimavaram District Registrar Office, Attili Sub Registrar, Moyyeru Village, R.S. No. 162/1B, Block No.2, R.C.C. Building with Door No. 2-92/1, Upstair Building, Shops in Ground floor, Upstair Business and residence bearing Assessment No. 706 and thatched house bearing Door No. 2-92 in an extent of 96 1/4 Square yards within the boundaries.
EAST: Raja Veedhi - 40 feet. **SOUTH:** Eeedara Raman's wall - 20 feet 9 inches. **WEST:** Site of Chitroju Veera Brahman - 40 feet 6 inches. **NORTH:** R and B Road - 22 feet.
Within the boundaries with all exiting things and constructions with R.C.C. Building and thatched house with all existing things attached to it etc.,
Decree Holder Value is Rs.2,50,000/-
Judgement Debtor Value is Rs. Not given.
Ameen Value is Rs.15,00,000/-

తాడేపల్లిగూడెం **ధూళిపాళ సూర్య రామారావు**
తేది:01-12-2023 పిటిషనరు తరపు న్యాయవాది